నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 5 | సంచిక: 49 | శనివారం, 18 జూలై 2026 | పేజీలు - | వెల : 3/-

C2 వాస్తవ తెలంగాణ

వాస్తవ తెలంగాణ

విలేఖరులు కావలెను

వాస్తవ తెలంగాణ

call:8499902850

# ఉమ్మడి పాలమూరుపై.. సీఎం రేవంత్ ఫోకస్

## రెండు నెలల్లో మూడుసార్లు పర్యటన

- ఎన్నికల వ్యూహానికి పదును
- అభివృద్ధి–రాజకీయ సమన్వయంతో సొంత జిల్లాపై పట్టు బిగించే ప్రయత్నం





**వాస్తవ తెలంగాణ** వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గత రెండు నెలల్లోనే మూడుసార్లు జిల్లాలో పర్యటించడం, వరుసగా అభివృద్ధి కార్యక్రమాలు, సమీక్షలు నిర్వహించడం దీనికి నిదర్శనంగా భావిస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్ రెడ్డి స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి కావడంతో ఉమ్మడి పాలమూరుపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయడంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది.

### సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన

ఇటీవల పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులను సీఎం పరిశీలించారు. అనంతరం జడ్చర్లలో జరిగిన బహిరంగ సభలో అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, నిధుల కేటాయింపుపై హామీలు ఇచ్చారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఇటీవల ఊరుకొండ, మిడ్జిల్, కొత్తకోట, దివిటిపల్లి తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న సీఎం, ఫ్యూచర్ సిటీ, విద్యా, పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనల్లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు సమిష్టిగా పాల్గొనడం ద్వారా పార్టీ ఐక్యతను ప్రదర్శించే ప్రయత్నం చేశారు.

### ప్రజల్లోకి ప్రభుత్వ పనులు

రాష్ట్ర మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తదితరులు జిల్లాలో వరుస అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రభుత్వ పనులను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. డీలిమిటేషన్ అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అసెంబ్లీ స్థానాల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో ఈ ప్రాంతానికి రాజకీయంగా మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా జిల్లాలో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూర్చే దిశగా సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# సీతారామను పూర్తి చేస్తాం



**సత్తుపల్లి: వాస్తవ తెలంగాణ** గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీ–డిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనానికి నష్టం కలిగించారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రూపొందించారని, వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామనీ, అవసరమైన బిల్లులను సిద్ధం చేసి వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు వెలుగులు




**హైదరాబాద్: వాస్తవ తెలంగాణ** రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో యుద్ధ ప్రాతిపదికన ఆ కేంద్రాలకు విద్యుత్ కనెక్షన్లు కల్పిస్తున్నారు. కేవలం గత ఆరు నెలల్లోనే 9,800 కేంద్రాలకు కొత్తగా విద్యుత్ సౌకర్యం కల్పించడం విశేషం. రాష్ట్రంలో మొత్తం 35,781 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం 32,109 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. అంటే దాదాపు 90 శాతం కేంద్రాలు విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్నాయి. మిగిలిన కేంద్రాలకు సైతం త్వరితగతిన విద్యుత్ సౌకర్యం కల్పించి నూరు శాతం విద్యుదీకరణ లక్ష్యాన్ని చేరుకునేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ చర్యలను వేగవంతం చేసింది.గతంలో దాదాపు 40 శాతం అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సౌకర్యమే లేకపోవడంతో చిన్నారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీకటి గదులు, ఉక్కపోత వాతావరణంలో చిన్నారులు కేంద్రాలకు రావాలంటేనే భయపడే పరిస్థితులు ఉండేవి. ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో వేసవి కాలంలో పిల్లలను కేంద్రాల్లో ఉంచడం అంగన్వాడీ కార్యకర్తలకు సవాల్‌గా మారేది. డిజిటల్ బోధనకు సైతం విద్యుత్ లేమి ప్రధాన అడ్డంకిగా నిలిచింది.

# ప్రత్యామ్నాయ పంటలు వేయాలి

- రైతులకు విస్తృత అవగాహన కల్పించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశం

**వాస్తవ తెలంగాణ** ఎల్‌నినో ప్రభావంతో రైతులు వరికి బదులుగా తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా విస్తృత అవగాహన కల్పించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లెట్స్, పప్పు దినుసులు, కూరగాయలు, పామాయిల్ వంటి పంటలను ప్రోత్సహించాలని సూచించారు. బోరు బావుల ఆధారంగా వరి సాగు చేయవద్దని, భూగర్భ జలాలు తగ్గి పంట నష్టాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. బిందు, తుంపర్ల సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని, కూరగాయల సాగుకు ప్రభుత్వం ఎకరాకు రూ.9,600 ప్రోత్సాహకం అందిస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో అధికారులు పర్యటించి ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటలపై రైతులకు సలహాలు ఇవ్వాలని, జిల్లా కంటింజెంట్ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా ఉద్యాన అధికారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# మూసపేట్ డిప్యూటీ కమిషనర్ సేవలకు ప్రశంసల వెలువ



**కూకట్ పల్లి జులై 17(వాస్తవ తెలంగాణ )** మూసాపేట సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ మున్సిపల్ పరిపాలనలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వై. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిబద్ధతతో పనిచేస్తే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ మున్సిపల్ సేవలను మెరుగుపరిచేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారంతో నగరాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా మరింత సమర్థవంతంగా సేవలందిస్తామని తెలిపారు.ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాలుగోన్నారు.

# ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది ఎమ్మెల్యే కృష్ణారావు



**కూకట్ పల్లి జులై 17 (వాస్తవ తెలంగాణ )** శేరి లింగంపల్లి నియోజక వర్గం గచ్చిబౌలి ,కొండాపూర్ డివిజన్ల లో శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు బి ఎల్ ఏ లతో సమీక్ష సమావేశం పాల్గొన్న కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని ఎప్పటికప్పుడు బి.ఎల్.ఎ, బి.ఎల్.ఓ లకు అందుబాటులో ఉండి ఏదైనా సమస్య ఉంటే వాటిని సరి చేయాలని అలాగే ఓటర్ల ఎవరైనా అందుబాటులో లేనప్పుడు వారి సమాచారం సేకరించి తిరిగి మళ్లీ బి.ఎల్.ఎ..బి.ఎల్.ఓ లకు వారి సమాచారం అందించి వారి ఓటును పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు



అలాగే ఎస్. ఐ .ఆర్ గడువు వచ్చేనెల 3 వ తేదీ వరకు పొడిగించిన సందర్భంగా ఎవరిది మిస్ కాకుండా చూడాలని అన్నారు.ఓటు ప్రతి ఒక్కరి పౌరుహక్కని.. ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఏమైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే తెలుసుకుని వారు ఇచ్చిన దరఖాస్తు నింపి ఇవ్వాలని ఇవన్నీ కూడా దగ్గరుండి చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు రాబోయే ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల ఓటు హక్కును కూడా కాపాడాల్సిన ఆవశ్యకత కూడా ఉందని ఈరోజు సామాన్య కార్యకర్త రేపు కార్పొరేటర్, ఎమ్మెల్యే అయ్యే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ కూడా నిబద్ధతతో పని చేస్తే భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు కార్యకర్తలు బి.ఎల్.ఎ లు పాల్గొన్నారు.

# కె పి హెచ్ బి పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా జి.విజయ్ కుమార్

**కూకట్ పల్లి జులై 17 (వాస్తవ తెలంగాణ )** కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా జి.విజయ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ జారీ చేసిన 55 మంది ఇన్స్పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల్లో భాగంగా సైబర్ క్రైమ్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్‌ను కెపిహెచ్‌బి స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా నియమించారు. ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ కె పి హెచ్ బి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలందరూ ఏలాంటి సమస్యలు ఇబ్బందులు ఉన్న ఏలాంటి భయభ్రాంతులకు గురికాకుండా తమను నేరుగా సంప్రదించాలన్నారు. సమాజ శ్రేయస్సు శాంతిభద్రతల పరిరక్షణ ధ్యేయంగా తాము పని చేస్తామన్నారు.




# స్టూడెంట్స్ కు విద్యా సామాగ్రి అందజేత..



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్..** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్ గిద్ద మండలం విట్టల్ నాయక్ తండ స్కూల్లో స్టూడెంట్స్ కు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాసామాగ్రి అందజేశారు. ఏన్టిటిడాటా సంస్థ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ కు స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చిరంజీవి మాట్లాడుతూ పాఠశాల స్టూడెంట్స్ కు విద్యా సామాగ్రి అందజేయడం అభినందనీయమని చెప్పారు. కార్యక్రమంలో గుండెరావు పటేల్, ఇమ్రోజ్, సర్పంచి జాదవ్ రాజు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎన్ లినో ఎఫెక్ట్.. వరికి ప్రత్యామ్నాయ పంటలే మేలు

**ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి.**
**తక్కువ నీటి వినియోగ పంటలను ప్రోత్సహించాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్,టౌన్ :-** ఎన్ లినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయ, తక్కువ నీటి వినియోగ పంటల సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ఎన్ లినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్న అంశంపై వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, సాగులో వైవిధ్యాన్ని పాటించి, తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు వీలుగా మిల్లెట్స్, కూరగాయలు, పప్పు దినుసులు, పామాయిల్ సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల కంటే ఆరుతడి పంటలు, తక్కువ రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పర్యటించి, ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటల వివరాలను రైతులకు వివరించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు బిందు, తుంపర్ల సేద్యం వంటి ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు, సూచనలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. బోరు బావుల ద్వారా పంట సాగు చేస్తున్న రైతులు వరి సాగు చేయొద్దని, రానున్న రోజుల్లో భూ గర్భ జలాలు తగ్గిపోయి నీటి కొరత ఏర్పడుతుందని తద్వారా పంట నష్టం వస్తుందని సూచించారు. కూరగాయలు సాగుకు ప్రభుత్వం ఎకరాకు 9,600 రూపాయలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సాగు చేయాల్సిన పంటలపై జిల్లా కంటింజెంట్ (జిల్లా అత్యవసర ప్రణాళిక) ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఇంచార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి , జిల్లా ఉద్యాన అధికారి ప్రతాప్ సింగ్ అన్ని మండలాల ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి హిందూ స్మశాన వాటికలో ఇతర మతాలకు స్థలం కేటాయింపుపై బీజేపీ ఆందోళన..

**చర్లపల్లి హిందూ స్మశాన వాటికను సందర్శించిన ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్**
**ఇతర మతాలకు స్థలం కేటాయింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్**
**హిందూ కుల సంఘాల నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు**



**కాప్రా మండలం వాస్తవ తెలంగాణ న్యూస్/** మేడ్చల్ జిల్లా కాప్ర మండలం చర్లపల్లి హిందూ స్మశాన వాటికలో ఇతర మతాలకు స్థలం కేటాయించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ హిందూ కుల సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం ఆందోళన చేపట్టారు. హిందూ స్మశాన వాటికను సందర్శించిన ఆయన స్థానిక ప్రజలు, కుల సంఘాల ప్రతినిధులతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చర్లపల్లి హిందూ స్మశాన వాటిక తరతరాలుగా హిందువుల అంత్యక్రియల కోసం వినియోగంలో ఉందని, రెవెన్యూ రికార్డుల్లో కూడా హిందూ స్మశాన వాటికగానే నమోదై ఉ ందని పేర్కొన్నారు. హిందూ స్మశాన వాటికలో ఇతర మతాలకు స్థలం కేటాయించే ప్రతిపాదనలు హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. మత విశ్వాసాలు, సంప్రదాయాలకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, హిందూ స్మశాన వాటికను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే స్పష్టత ఇచ్చి, ఇతర మతాలకు స్థలం కేటాయించే నిర్ణయాన్ని ఉ పసంహరించుకోవాలని కోరారు. అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, హిందూ కుల సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి పర్యటన

**శుభకార్యాలు, పరామర్శలు.. కార్యకర్తలతో భేటీ**





**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి :-** మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మా దేవేందర్ రెడ్డి శుక్రవారం రామాయంపేటలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా బీఆర్ఎస్ నాయకులు కృష్ణగౌడ్--పద్మ దంపతుల మనుమడి తొట్టెల వేడుకకు హాజరై నవజాత శిశువును ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్త కిరణ్ సాగర్ ఇంటికి వెళ్లి కాలు ఫ్రాక్చర్‌కు గురైన ఆయన కుమార్తెను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.తదుపరి పట్టణంలోని బెల్లం చాయ్ టీ టైం వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు.పార్టీ బలోపేతం, స్థానిక రాజకీయ పరిస్థితులు, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, కష్టకాలంలో అండగా నిలవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ బాదే. చంద్రం, కౌన్సిలర్ రమేష్, నాయకులు హస్మద్దీన్, ఉమామహేశ్వర్, శ్రీకాంత్ సాగర్, బబ్లు, మధుకర్, కిరణ్ సాగర్, వంశీ సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పి సి సి ఉపాధ్యక్షులు బండి రమేష్ కి భూధాన్ భూముల సమస్యపై వినతిపత్రం అందజేత



**కూకట్ పల్లి జులై 17 (వాస్తవ తెలంగాణ ) భూదాన్ భూముల** దశాబ్దాలుగా పరిష్కారం దొరకని సమస్యకు సహాయం చేసి 800 మంది లబ్దిదారులకు న్యాయం చేయాలని బాధితులు పీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. మూసాపేట ఆంజనేయ నగర్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధితులు, పలువురు స్థానిక రాజకీయ నాయకులు ఐడిపియల్ ఉద్యోగుల అండతో సుమారు 17 ఎకరాల భూదాన్ భూమిని కబ్జా చేసి హక్కుదారులను బెదిరిస్తున్నారని, హైకోర్టు క్లియర్ డైరేషన్స్ ఉన్నప్పటికీ అధికారులు కూడా ఒత్తిళ్లకు లొంగి సమస్యపై దృష్టి పెట్టడం లేదని న్యాయం చేయాలిని కోరారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఎలాంటి అక్రమాలకు, ఒత్తిడులకు లొంగినా పై అధికారులకు పిర్యాదు చేస్తానని, బాధితులకు న్యాయం జరిగేదాకా వారి పక్షాన నిలబడతానని బండి రమేష్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు,ఖలీమ్ ఖాన్,ఫాల్గుణ రావు, చందర్రావు,వాసు,నారాయణ,ఆంజనేయులు,రఘువీర్,మల్లికార్జున్,వాణి, కనకమ్మ వజ్రం , భూదాన్ ల్యాండ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దళిత సంక్షేమ పథకాలపై - దళిత ప్రజాప్రతినిధుల సమీక్ష



**వాస్తవతెలంగాణా డైలీ న్యూస్ కంటోన్మెంట్/** సోమాజిగుడ ,దిల్ ఖుషా గెస్ట్ హౌస్ లో ఎంపీ డాక్టర్ మల్లు రవి అధ్యక్షతన తెలంగాణ కాంగ్రెస్ ఎస్సీ ఎంపీలు, ఎమ్మెల్యేలు సమావేశమై ప్రభుత్వం దళిత నియోజకవర్గాలలో చేపడుతున్న సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. దళిత నియోజకవర్గాల్లో ఇంకా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి, పథకాల అమలుకు సంబంధించి ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్తామని నాయకులు అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను మరింతగా జనంలోకి తీసుకువెళ్లడానికి జన చైతన్య యాత్రను చేపట్టే అంశం పై కూడా చర్చించామన్నారు. ఈ సమావేశంలో ఎంపీ డా. మల్లు రవి, కంటోన్మెంట్ ఎమ్మెల్యేలు శ్రీగణేష్, మేడిపల్లి సత్యం, డా.కవ్వంపల్లి సత్యనారాయణ, వంశీకృష్ణ, కాలే యాదయ్య, ఆర్ నాగరాజు, సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# జూలై 31లోగా రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్



**వాస్తవ తెలంగాణ న్యూస్,మెదక్ టౌన్ :-** జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ ఈ నెల 31వ తేదీలోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్ తెలిపారు. పౌర సరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు భారత ప్రభుత్వానికి ఈ-కేవైసీ వివరాలను నవీకరించాల్సి ఉ న్నందున ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టినట్లు పేర్కొన్నారు.జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల డీలర్లు తమ పరిధిలోని లబ్ధిదారులతో పాటు వన్ నేషన్--వన్ రేషన్ కార్డు (పోర్టబిలిటీ) ద్వారా రేషన్ పొందుతున్న లబ్ధిదారుల ఈ-కేవైసీని కూడా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు.ప్రతిరోజూ రేషన్ దుకాణాలను తెరిచి ఉంచి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ఈ-కేవైసీ నిర్వహించి, జూలై 31 నాటికి వంద శాతం పూర్తి చేయాలని డీలర్లకు సూచించినట్లు తెలిపారు. త్వరలో కమిషనర్ జిల్లాల వారీగా ఈ-కేవైసీ పురోగతిని సమీక్షించనున్న నేపథ్యంలో, అర్హులైన రేషన్ కార్డుదారులందరూ తమ సమీప రేషన్ దుకాణాన్ని సందర్శించి నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని నిత్యానంద్ కోరారు.

# బైక్ పై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు మెట్రో పిల్లర్ కు డి కొని మృతి



**కూకట్ పల్లి జులై 17 (వాస్తవ తెలంగాణ )** కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బైక్ పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు మెట్రో పిల్లర్ ఢీకొని మృతి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లాకు చెందిన అఖిలేష్ యాదవ్ ( 24) మహ్మద్ యూనుస్ (26) ఇద్దరు కలిసి బైక్ పై గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత జేఎన్టీయూ నుండి కూకట్ పల్లి వైపుకు వెళుతుండగా కూకట్ పల్లి భాగ్య నగర్ బస్ స్టాప్ దగ్గర బైకు అదుపుతప్పి 746 పిల్లర్ ని డికొట్టడంతో కిందపడి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాని అందులో అఖిలేష్ యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాగా వెనకాల కూర్చున్న యునుస్ అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందడన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# మరకత శివాలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారి వాసుదేవ నాయుడు ప్రత్యేక పూజలు




**శంకర్ పల్లి వాస్తవ తెలంగాణ న్యూస్;** శంకర్‌పల్లి మండలం పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో వెలసిన 11వ శతాబ్దానికి చెందిన శ్రీ మహిమగల బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన అధికారి వాసుదేవ నాయుడు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ కడకంచి కుమార్ యాదవ్ టిటిడి అధికారిని స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా టిటిడి అధికారి మాట్లాడుతూ పురాతన శివలింగాన్ని దర్శించుకుని అభిషేకాలు నిర్వహించడం గొప్ప అనుభూతి కలిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# తల్లీ కూతుళ్ళ మిస్సింగ్...



**నారాయణ్ ఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** కుటుంబ తగాదాలతో విసుగుచెందిన గృహిణి తన ఇద్దరు కూతుళ్ళను తీసుకొని గత నాలుగు రోజుల క్రితం ఇంటినుండి వెళ్ళిపోయిందని, వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కల్హేర్ మండల ఎస్సై రవిగౌడ్ తెలిపారు.శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. మండల పరిధిలోని బీబీపేట్ గ్రామానికి చెందిన తాడబోయిన అంజయ్య కూతురు కయ్యా ముక్తాబాయిని కొత్తపల్లి గ్రామానికి చెందిన శంకర్ తో 7 సం,ల క్రితం పెళ్లి అయింది అన్నారు.వాళ్ళకు ఇద్దరు కూతుర్లు అనూష (4), అమృత(2) ఉన్నారని,శంకర్, ముక్తాభాయిలు గొడవపడి గత 15 రోజుల నుండి ముక్తాబాయి తన ఇద్దరు కూతుళ్ళతో పుట్టినిల్లు బీబీపేట్ వద్ద ఉంటున్నారు అన్నారు.ఈనెల 13న ఆమె ఇద్దరు కూతుళ్లను తీసుకుని బీబీపేట్ గ్రామం నుండి వెళ్లి పోయిందని,నేటివరకు తిరిగి ఇంటికి రాలేదు అన్నారు. పిల్లల ఆచూకి కోసం ముక్తాబాయి తండ్రి అంజయ్య చుట్టుపక్కల, బంధువుల వద్ద, స్నేహితుల వద్ద విచారించిన వాళ్ళ ఆచూకి లభించలేదు అన్నారు.అంజయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నాగారం, కరీంగుడ ప్రాసెస్ యూనిట్లను పరిశీలించినా వినయ్ కృష్ణారెడ్డి,వాణిరెడ్డి




**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్**/మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ పరిధిలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అదనపు కమిషనర్ (హెల్త్ & శానిటేషన్) రఘు ప్రసాద్, ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ వాణి , డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) శ్రీనివాస్, ఏఈఈ (ఎస్‌డబ్ల్యూఎం) చంద్రశేఖర్ తో కలిసి కరీంగూడలోని కోకోపీట్ ప్రాసెసింగ్ యూనిట్ మరియు నాగారం వార్డులోని గ్రీన్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి వినియోగంలోకి తీసుకురావడానికి ఇలాంటి యూనిట్లను కార్పొరేషన్ పరిధిలో సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రాంపల్లి సమీపంలో ప్రతిపాదిత సిడిడి (కన్స్ట్రక్షన్ & డెమోలేషన్ ) వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ స్థలాన్ని, అలాగే ఘట్కేసర్ వార్డ్ కొండాపూర్‌లో జరుగుతున్న బయో మైనింగ్ ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేసి పర్యావరణహితంగా నిర్వహించేలా అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు.

# బీఆర్ఎస్ కార్యకర్త కుమార్తె పెళ్లికి అండగా కంతారెడ్డి తిరుపతి రెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ ప్రతినిధి:–** పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని మరోసారి చాటుతూ,బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంతారెడ్డి తిరుపతి రెడ్డి ఉదారతను చాటుకున్నారు. రామాయంపేట మండలంలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త తుడుం శ్రీనివాస్ కుమార్తె వివాహానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు బానప్ప నర్సారెడ్డి ద్వారా ఈ సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన కంతారెడ్డి తిరుపతి రెడ్డి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండమీది బాబు, మదూరు స్వామి, సాల్మన్, మదూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

## మున్సిపల్ కమిషనర్ ప్రశాంతి



**నారాయణఖేడ్ వాస్తవ తెలంగాణ న్యూస్** ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని గృహ వాసులు తమ ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా,పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ వి. ప్రశాంతి అన్నారు.ఫ్రై డే – డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖేడ్ మున్సిపాలిటీలోని 1 వార్డులో సందర్శించారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ..వర్షాకాలం వ్యాధులు ప్రభరిల్లే అవకాశం ఉంటుంది కావున ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో నీటి నిలువ లేకుండా చూసుకోవాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.నీటి నిల్వ వల్ల దోమలు,ఈగలు చేరి ప్రజలకు అనారోగ్యాలకు గురిచేస్తాయి అన్నారు.ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,కార్యాలయ సిబ్బంది,కాలనీ వాసులు పాల్గొన్నారు.


# మెదక్‌కు నేడు టాలీవుడ్ హీరో మంచు విష్ణు

**ఏడుపాయల అమ్మవారి దర్శనం.. మెదక్ ఖిల్లా, క్యాథడ్రల్ చర్చ్ సందర్శన..**



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్ టౌన్:** మెదక్ జిల్లా నేడు సినీ సందడికి వేదిక కానుంది. టాలీవుడ్ ప్రముఖ హీరో మంచు విష్ణు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా టూరిజం శాఖ ఆహ్వానం మేరకు మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన రాకతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొనగా, ప్రజలు ఘనంగా స్వాగతం పలకాలని జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్ కోరారు.పర్యటనలో భాగంగా మంచు విష్ణు తొలుత ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన మెదక్ ఖిల్లాను సందర్శించనున్నారు. ఆ తర్వాత ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ క్యాథడ్రల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని, మీడియా ప్రతినిధులతో సమావేశం కానున్నారు.మంచు విష్ణు పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్ తెలిపారు. మెదక్ పర్యాటక, ఆధ్యాత్మిక, చారిత్రక విశిష్టతను దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా ఈ పర్యటన ఉపయోగపడుతుందని పేర్కొంటూ, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై హీరోకు ఘన స్వాగతం పలకాలని విజ్ఞప్తి చేశారు.

# అన్యాయం జరిగిన కార్మికుడికి "మే" నెల రావాల్సిన వేతనం ఇప్పించిన -బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి




**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల ఇండస్ట్రీ ఏరియాలోని ఓ కంపెనీలో సంజయ్ కుమార్ అనే కార్మికుడు గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల కంపెనీ లో నుండి డ్యూటీ మానేయడం జరిగింది.. సంజయ్ కుమార్ కు కంపెనీ యజమాన్యం మే, నెల వేతనం రావాల్సి ఉండక అవి ఇవ్వకపోవడంతో యజమాన్యం అతన్ని పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అతనికి వేతనం ఇవ్వకుండా మాయమాటలు చెప్పి అతని ఇబ్బంది పెట్టేవారూ, అడిగి అడిగి ఇబ్బంది చెందిన సంజయ్ కుమార్ అనే కార్మికుడు కి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే కార్మికులకు న్యాయం చేస్తారని తోటి కార్మిక మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి గురించి తెలుసుకొని తన కార్యాలయం వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు...వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన జీడిమెట్ల ఇండస్ట్రీ లో ఉన్న కంపెనీ యజమాన్యం దగ్గరికి వెళ్లి కార్మికుడు సంజయ్ కుమార్ కి రావాల్సిన వేతనం ఇప్పించడం జరిగింది... కార్మికుడు సంజయ్ కుమార్ మాట్లాడుతూ నాకు మా కుటుంబానికి న్యాయం చేసిన కార్మికనాయకుడు రవి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు...ఈ కార్యక్రమంలో, సంతోష్ గౌడ్ సుదర్శన్, జగన్, మోజెష్, కిరణ్, పాల్గొన్నారు...

# ప్రత్యర్థి పార్టీల మధ్య మానవీయ రాజకీయాలకు నిదర్శనంగానిలుస్తున్నా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బాధలో ఉన్నా నేతలను పరామర్శ



**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి, జిల్లా సదాశివపేట మండలం రాజకీయాల్లో తీవ్ర విమర్శలుఆరోపణలు సహజమే అయితే వ్యక్తిగత విషాదాలు, ఆరోగ్య సమస్యల సమయంలో రాజకీయాలకు అతీతంగా స్పందించడం ప్రజల్లో మంచి సందేశాన్ని ఇస్తుంది. సదాశివపేట మండల బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ అరిపొద్దీన్‌ను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పరామర్శించడం అలాంటి రాజకీయ సంస్కృతికి ఉదాహరణగా నిలిచింది. గాయాలతో చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న అరిపొద్దీన్‌ను ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మిలిగిరిపేట గ్రామ బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తండ్రి అంజిరెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్, పలువురు సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. విశ్లేషణసంగారెడ్డి రాజకీయాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తీవ్ర పోటీ కొనసాగుతున్నప్పటికీ, వ్యక్తిగత విషాదాల సమయంలో పరస్పర పరామర్శలు రాజకీయ పరిపక్వతకు సంకేతంగా కనిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు రాజకీయ విభేదాలను పక్కనపెట్టి మానవీయ కోణంలో స్పందిస్తే ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడుతుంది.ఇటీవల స్థానిక రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు పెరుగుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఈ పరామర్శ రాజకీయాల కంటే మానవ సంబంధాలకు ప్రాధాన్యం ఇచ్చిన చర్యగా స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రజాప్రతినిధులు ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములు కావాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం మరోసారి గుర్తు చేసింది.

# యంయంసి పరిధి కీసర సర్కిల్లో భారీ షెడ్ల నిర్మాణం

**చోద్యం చూస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు..**
**అక్రమ నిర్మాణాలకు పూర్తిస్థాయిలో అధికారుల అండదండలు?**
**జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ , కీసర లో భారీ షెడ్లా నిర్మాణం అనుమతులపై పలు అనుమానాలు.?**
**రాజకీయ పలుకుబడితో యంయంసి ఆదాయానికి భారీ గండి**
**పలు కంప్లైంట్లు పట్టించుకొని టౌన్ ప్లానింగ్.,, అధికారుల మౌనం..**

**మేడ్చల్ జిల్లా వాస్తవ తెలంగాణ** కీసర సర్కిల్ మల్కాజిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కీసర సర్కిల్ పరిధిలో బండ్లగూడ, కీసర లో భారీ షెడ్ల నిర్మాణం జోరుగా సాగుతుంది, సంబంధిత అధికారులు మౌనం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. బండ్లగూడ సమీపంలో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నప్పటికీ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూ తూ మంత్రంగా నోటీస్ ఇచ్చి, చేతులు దులుపుకుంటూ, అక్రమ నిర్మాణా దారులకు పూర్తి స్థాయిలో మద్దతు ఇస్తున్నారని, పని తొందరగా పూర్తి చేసుకోవాల్సిందిగా సలహాలు కూడా ఇస్తున్నారని పుకార్లు ఉన్నాయి. ఈ పుకార్లకు బలం చేకూర్చేలా అక్రమ నిర్మాణాలు జరుగుతుండడం అధికారులు అక్రమ నిర్మాణా ధరలతో ఏకమైయ్యారూ అనేది నిజమే అని కీసర సర్కిల్ ప్రజలు భావిస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నదానిపై స్పష్టత లేకపోయినా పనులు నిరాటంకంగా కొనసాగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సాధారణ ప్రజలు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా వెంటనే నోటీసులు జారీ చేసే అధికారులు, ఇంత భారీ నిర్మాణాన్ని చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ నిర్మాణం వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయనే ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. రాజకీయ పలుకుబడి తో నిబంధనలను పక్కనబెట్టి నిర్మాణం కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో నజరానాలు అందడం తోనే కీసర సర్కిల్ అధికారులు కళ్లు మూసుకున్నారనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉన్నతాధికారులు తరచూ ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పటికీ నిర్మాణాన్ని గుర్తించలేదా? లేక ఉద్దేశపూర్వకంగానే పట్టించుకోవడం లేదా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై పలు ఆరోపణలు వచ్చినా, కఠిన చర్యలు లేకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై సందేహాలు పెంచుతోంది. ఇప్పటికైనా సంబంధిత డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, నిబంధనల అమలు అంశాలపై పూర్తి వివరాలను వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ నిర్మాణం అక్రమమని తేలితే వెంటనే పనులను నిలిపివేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.







# ఓటు నమోదే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది


**సూరారంలో వినూత్న చైతన్య యాత్రతో ప్రజలను ఆకట్టుకున్న కోల రవీందర్ ముదిరాజ్**
**ఇంటింటికీ వెళ్లి కొత్త ఓటర్ల నమోదుపై విస్తృత అవగాహన**
**ఆధార్--ఓటరు అనుసంధానంపై ముందస్తు చైతన్యం**
**స్వయంగా తయారు చేసిన బ్యానర్లతో వినూత్న ప్రచారం**
**మైకింగ్ ద్వారా కూడళ్లలో మారుమోగిన ఓటు హక్కు సందేశం**
**విద్యార్థుల ద్వారా ప్రతి కుటుంబానికి అవగాహన చేర్చే ప్రయత్నం**
**స్మార్ట్‌ఫోన్‌తో ఇంటి నుంచే ఓటరు నమోదు చేసుకోవాలని సూచన**
**యువత, మహిళలు, సీనియర్ సిటిజన్లతో చైతన్య ర్యాలీశ్రీ**
**ప్రజల ప్రశంసలు అందుకున్న సామాజిక సేవా కార్యక్రమం**
**ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమని పిలుపు**
**ప్రచారాన్ని వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేసిన స్థానికులు**

**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలని సామాజిక, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఓటు హక్కు ప్రాధాన్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సూరారం కాలనీ, బస్‌స్టాప్, ఫస్ట్ హోమ్ జెండా, సెకండ్ హోమ్ జెండా, సూరారం ఎక్స్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసే అవకాశాలు ఉండవచ్చని, అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరూ ఆలస్యం చేయకుండా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇంట్లో ఉన్న స్మార్ట్‌ఫోన్ ద్వారానే కుటుంబ సభ్యుల సహాయంతో సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు. ప్రచారంలో భాగంగా స్వయంగా కాటన్ వస్త్రంపై స్కెచ్‌పెన్‌తో సందేశాలు రాసి బ్యానర్లు తయారు చేయడంతో పాటు, సొంతంగా రికార్డు చేసిన సందేశాలను మైకింగ్ ద్వారా ప్రధాన కూడళ్లలో ప్రసారం చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. పాఠశాల విద్యార్థులకు సైతం ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరిస్తూ, తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ చైతన్య ర్యాలీలో 60 గజాల శ్యామ్, గుట్ట అశోక్, ఆర్. లక్ష్మీనారాయణ, జి. రమేష్, రాజు, ఆంజనేయులు, దేవిరెడ్డి తదితరులతో పాటు పలువురు యువకులు, సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు. వినూత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం విశేషంగా నిలిచింది.



# కార్మికుడికి నిలిచిపోయిన వేతనం ఇప్పించిన బీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు రవి

**జీడిమెట్ల పరిశ్రమలో కార్మికుడికి న్యాయం**
**మే నెల వేతనం చెల్లించేలా యాజమాన్యంతో చర్చలు**
**ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు**
**శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి చొరవతో సమస్య పరిష్కారం**
**న్యాయం జరిగినందుకు కార్మికుడి ఆనందం**
**కార్యక్రమంలో పాల్గొన్న పలువురు కార్మిక ప్రతినిధు..**




**జీడిమెట్ల, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్ల పరిశ్రమల ప్రాంతంలో ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేసిన సంజయ్ కుమార్‌కు రావాల్సిన మే నెల వేతనాన్ని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి చొరవతో యాజమాన్యం చెల్లించింది. సంజయ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా సంబంధిత కంపెనీలో విధులు నిర్వర్తించారు. వ్యక్తిగత అనివార్య కారణాలతో ఉద్యోగం విరమించుకున్న అనంతరం ఆయనకు రావాల్సిన మే నెల వేతనాన్ని సంస్థ యాజమాన్యం చెల్లించకుండా పలుమార్లు తిప్పివంపినట్లు సమాచారం. పలుమార్లు యాజమాన్యాన్ని సంప్రదించినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తోటి కార్మికుల సూచన మేరకు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవిని కలిసి తన గోడును వివరించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన రవి నేరుగా సంబంధిత కంపెనీ యాజమాన్యాన్ని కలిసి కార్మికుడికి రావాల్సిన వేతనాన్ని వెంటనే చెల్లించేలా చర్చలు జరిపారు. దీంతో యాజమాన్యం సంజయ్ కుమార్‌కు పెండింగ్‌లో ఉన్న మే నెల వేతనాన్ని చెల్లించింది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ, తనకు, తన కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేసిన బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఇటువంటి సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, సుదర్శన్, జగన్, మోజెష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బుర్రా అగయ్య--రుక్కమ్మ దంపతుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 289 దూలపల్లి డివిజన్‌లో మాజీ సర్పంచ్, కొంపల్లి పీఏసీఎస్ (గ్రూజా) వ్యవస్థాపకులు, మాజీ చైర్మన్ కీ.శే. బుర్రా అగయ్య మరియు ఆయన సతీమణి కీ.శే. బుర్రా రుక్కమ్మ (లక్ష్మీదేవి) దంపతుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, బుర్రా అగయ్య--రుక్కమ్మ దంపతులు సమాజాభివృద్ధి, సహకార రంగం, గ్రామాభివృద్ధికి అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, బుర్రా అగయ్య--రుక్కమ్మ దంపతులు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసి గ్రామ ప్రజల మన్ననలు పొందారని, వారి సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ మహోత్సవంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని దంపతులకు ఘన నివాళులు అర్పించారు.

# సాయిబాబా నగర్‌లో కాంగ్రెస్ నూతన కార్యాలయం ప్రారంభం




**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 292 డివిజన్ సాయిబాబా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరి కిరణ్ పటేల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయ ప్రారంభోత్సవంలో హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు కేవలం రాజకీయ కార్యక్రమాల నిర్వహణకే పరిమితం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ కార్యకర్తలకు మార్గనిర్దేశం చేసే సేవా కేంద్రాలుగా పనిచేయాలని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.




# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు కలెక్టర్ మను చౌదరి



**కూకట్ పల్లి జులై 17 (వాస్తవ తెలంగాణ )** మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే – ఐజేయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాం రెడ్డిలతో పాటు జిల్లా అక్రిడేషన్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో జర్నలిస్టులుగా పని చేస్తున్న సీనియర్ రిపోర్టర్లందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు జిల్లా టియుడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ నిబంధనలు పేరుతో కొంతమందికి ఇబ్బంది కలిగించకుండా అందరికీ కార్డులు అందించే విధంగా చూడాలని కోరారు. అక్రిడేషన్ కార్డుల జారీలో జాప్యం చేయకుండా, అందరికీ అందజేయాలని, దీనికి అక్రిడేషన్ కమిటీ సహకారం అందజేస్తుందని తెలిపారు. కమిటీ ప్రతినిధుల వినతి మేరకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, అక్రిడేషన్ కమిటీ సభ్యులు రామారావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రవి కిరణ్ రెడ్డి, డబ్ల్యూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# నూతన కార్యాలయ భవనాలకు స్థల సేకరణ వేగవంతం చేయాలి అధికారులకు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశం



**వాస్తవ తెలంగాణ న్యూస్, మెదక్,టౌన్** జిల్లాలోని నూతన మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ.. హవేలీఘన్‌పూర్, నిజాంపేట, చిలిపిచేడు నూతన మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే మెదక్, నర్సాపూర్, రామాయంపేట డివిజన్ల పరిధిలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయ భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను త్వరగా గుర్తించి, భూసేకరణకు సంబంధించిన ఫైళ్లను ఉన్నతాధికారులకు వెంటనే పంపించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ బవయ్య, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా పి. దళి నాయుడు బాధ్యతల స్వీకారం

**ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన పోలీసింగ్‌కు ప్రాధాన్యం**
**శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి**





**బాచువల్లి, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు...** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కు నూతన ఇన్‌స్పెక్టర్‌గా పి. దళి నాయుడు శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కార్యాలయంలో రికార్డులపై సంతకం చేసి విధులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టం అందరికీ సమానమనే సూత్రంతో పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని తెలిపారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, నేరాల నియంత్రణ, మహిళల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు పోలీస్ స్టేషన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసే విధంగా చర్యలు చేపడతామని, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా పనిచేస్తామని చెప్పారు. యువతలో చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు సైబర్ నేరాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బాచుపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది నూతన ఇన్‌స్పెక్టర్ పి. దళి నాయుడికి శుభాకాంక్షలు తెలియజేసి, ఆయన నాయకత్వంలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయండి



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి** <Š z eu. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వోలు) సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియను పూర్తి బాధ్యతతో నిర్వహిస్తూ ప్రతి అర్హ ఓటరికి సేవలు అందించాలని ఆదేశించారు. శుక్రవారం అల్వాల్ మండలంలోని 9వ నంబర్ పోలింగ్ స్టేషన్ వద్ద కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలతో మాట్లాడిన ఆయన, ఫారాల పంపిణీతో పాటు పూరించిన దరఖాస్తులను సకాలంలో స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారాలు పూరించే సమయంలో ఓటర్లకు ఎదురయ్యే సందేహాలను వెంటనే నివృత్తి చేస్తూ, వారికి సరైన అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతమైన విధానంలో ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా వెంటనే డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. డిజిటలైజేషన్ ప్రక్రియ ఎలా కొనసాగుతోందో కలెక్టర్ స్వయంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఇళ్లలో అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సంబంధిత సూపర్వైజర్లకు వెంటనే తెలియజేయాలని బీఎల్‌వోలకు సూచించారు. రోజువారీ లక్ష్యాలను సమయానికి పూర్తి చేస్తూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సలహాలు, మార్గదర్శకాలను అందించారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు.

# నేడే సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు




**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు.....** రాష్ట్రంలోని యువత, నిరుద్యోగుల సమస్యలను ప్రధానాంశంగా తీసుకుని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో నేడే హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో 'యువ సంగ్రామ సదస్సు' నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు (కేటీఆర్) హాజరై ప్రసంగించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. యువజన, విద్యార్థి విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సులో రాష్ట్ర యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలు, ఉద్యోగాల భర్తీ, ఉపాధి అవకాశాలు, యువత సంక్షేమం, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలపై పార్టీ తన అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు సమాచారం. యువతకు సంబంధించిన పలు కీలక అంశాలపై తీర్మానాలు కూడా చేసే అవకాశం ఉన్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. సదస్సు నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి యువత, విద్యార్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా యువత, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రజల దృష్టికి తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. సదస్సు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకోవడంతో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఐటం 01 ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న దృశ్యం

**జల సంరక్షణపై అవగాహన.. విద్యార్థులతో ప్రతిజ్ఞ**
**"క్యాచ్ ది రైన్"లో భాగంగా వ్యాసరచన పోటీలు**




**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్ జూలై 17 :** జల శక్తి జన భాగీదారి (జేఎస్‌జేబీ) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న "క్యాచ్ ది రైన్" ప్రచారంలో భాగంగా శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో జల సంరక్షణపై అవగాహన కార్యక్రమం, విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు.గుమ్మడిదల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వర్షపు నీటిని ఒడిసిపట్టడం, ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించడం, భూగర్భ జలాలను పరిరక్షించడం, నీటి వృథాను అరికట్టడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది నీటి సంరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థుల్లో నీటి పరిరక్షణపై చైతన్యం పెంపొందించేందుకు నీటి పొదుపు అంశంపై వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా నీటిని ఆదా చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారి ప్రభాకర్, నారాయణ, కామేశ్వరి, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. నీటి వనరులను పరిరక్షించడం ద్వారా భావితరాలకు సురక్షిత భవిష్యత్తు అందించవచ్చని వారు పేర్కొన్నారు.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు జిల్లా కలెక్టర్ మను చౌదరి హామీ



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు..** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడిటేషన్ కార్డులు అందజేసేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హత కలిగిన వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రాం రెడ్డితో పాటు జిల్లా అక్రిడిటేషన్ కమిటీ ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్పందిస్తూ, జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న అర్హులైన సీనియర్ రిపోర్టర్లందరికీ నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రిడిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతుందని, అర్హులైన ఒక్క జర్నలిస్టు కూడా నష్టపోకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు టీయూడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ, నిబంధనలను సాకుగా చూపుతూ అర్హులైన జర్నలిస్టులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ ప్రక్రియలో జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. జర్నలిస్టుల వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ దరఖాస్తుల పరిష్కారానికి వేగం పెరిగి, అర్హులైన జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు రామారావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రవి కిరణ్ రెడ్డి, డబ్ల్యూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్ పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసి పంపిణీ**



**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** ఆపద కాలంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ డివిజన్ కి చెందిన కూరపాటి రేణుక గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతుంది. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రెండు లక్షల 50 వేల రూపాయల విలువైన ఎల్ఓసిని శుక్రవారం సాయంత్రం వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎల్ఓసి లతోపాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పారదర్శకంగా పంపిణీ చేస్తున్నమని తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ నూతన సి ఐ గా డి. స్వామి గౌడ్



**కూకట్ పల్లి జులై 17 (వాస్తవ తెలంగాణ )** కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ నూతన సి ఐ గా డి. స్వామి గౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా సి ఐ మాట్లాడుతూ కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలందరూ ఏలాంటి సమస్యలు ఇబ్బందులు ఉన్న ఏలాంటి భయభ్రాంతులకు గురికాకుండా తమను నేరుగా సంప్రదించాలన్నారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడం నేరాల నియంత్రణ మహిళల భద్రత శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామనరు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

# అభివృద్ధి నిధులు జీతాలకా?

## ఫండ్స్ మళ్లిస్తే సహించం

- 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై బండి సంజయ్ ఆగ్రహం
- అవసరమైతే నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకే..
- కేంద్ర సహాయ మంత్రి





**వాస్తవ తెలంగాణ** గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం నిబంధనలకు విరుద్ధమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రూ.105 కోట్ల వ్యయంతో చేపట్టిన చెరువు పునరుద్ధరణతో పాటు పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే కేంద్రానికి నివేదిక పంపుతామని, అవసరమైతే ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేసే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులు, ఉద్యోగుల జీతాలు చెల్లించలేని పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు.

### తెలంగాణకు భారీగా కేంద్ర నిధులు

అమృత్1 కింద రూ.1,660కోట్లు, అమృత్2 కింద రూ.3,429 కోట్లు తెలంగాణకు కేంద్రం కేటాయించిందని బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలకు దాదాపు రూ.400 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సిరిసిల్ల మున్సిపాలిటీకి మాత్రమే రూ.105.57 కోట్లు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేంద్రం రూ.13 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసిందని, అయినప్పటికీ కేంద్రం రాష్ట్రానికి అన్యాయం చేస్తోందని కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు అవాస్తవమని ఆయన అన్నారు. రాష్ట్రంలోని అభివృద్ధి పనుల్లో కేంద్ర నిధులే కీలక పాత్ర పోషిస్తున్నాయని, గత రెండున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు తగిన నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్, ఎస్పీ మహేష్ బి. గీతే తదితరులు పాల్గొన్నారు.

# మూసాపేట డిప్యూటీ కమిషనర్‌కు ఘన సన్మానం.. సేవలకు ప్రశంసల జల్లు!

**హైదరాబాద్ (వాస్తవ తెలంగాణ న్యూస్) జూలై 17:** మూసాపేట సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ఓసి సంఘం ప్రధాన కార్యదర్శి వై. భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజలకు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా సేవలందిస్తూ మున్సిపల్ పరిపాలనలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వై. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిబద్ధతతో పనిచేస్తే ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ మున్సిపల్ సేవలను మెరుగుపరిచేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సహకారంతో నగరాభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా మరింత సమర్థవంతంగా సేవలందిస్తామని తెలిపారు. ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో సాగగా, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో పలువురు ఓసి సంఘం నాయకులు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేడు తెలంగాణ కేబినెట్ భేటీ

- రేవంత్ అధ్యక్షతన కీలక సమావేశం..
- మెట్రో విస్తరణ, పంచాయతీరాజ్ చట్ట సవరణపై నిర్ణయాలు



**వాస్తవ తెలంగాణ** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలతో కూడిన అజెండాపై కేబినెట్ చర్చించి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

### మెట్రో, ప్రాజెక్టులపై సమీక్ష

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టుల సవరించిన అంచనా వ్యయాలు, పనుల పురోగతిని మంత్రివర్గం సమీక్షించనుంది. అలాగే హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణ, ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ ప్రక్రియ, కేంద్ర ప్రభుత్వ వైఖరి, కమిటీ ఏర్పాటులో జాప్యంపై కూడా చర్చించనుంది.

### తాగునీరు, సాగునీటిపై ప్రత్యేక దృష్టి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సరఫరా, సాగునీటి నిర్వహణ, వ్యవసాయ కంటింజెన్సీ ప్రణాళిక అమలు, మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రానున్న అసెంబ్లీ వర్షాకాల సమావేశాల నిర్వహణపై కూడా కేబినెట్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

### పంచాయతీరాజ్ చట్ట సవరణకు ఆమోదం

గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయడానికి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70(3) సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఇక కేబినెట్ సమావేశానికి ముందు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ సమావేశమై ప్రభుత్వ భూముల విక్రయం ద్వారా నెలకు రూ.1,000 కోట్ల ఆదాయం సమీకరించే కార్యాచరణపై చర్చించనుంది.